క్లుప్తంగా

సైకిల్ కు ఓటెయ్యనన్నందుకు..

- దాడికి పాల్పడిన టీడీపీ కార్యకర్తలు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు


నాయపల్లి చుక్కా ఏసురత్నం

మంగళగిరి: నగర పరిధిలో పేటపూడి శిబిరంలో టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోయారు. స్థానిక ఓటరు చుక్కా ఏసురత్నాన్ని టీడీపీకి ఓటు వేయాలని కోరగా తిరస్కరించారు. వైఎస్సార్ సీపీకి వేస్తానని చెప్పడంతో స్థానిక టీడీపీ కార్యకర్తలు దిడ్ల సత్యానందం, కార్యంశెట్టి రాజు, కార్యంశెట్టి దేవరలు దాడి చేసి గాయపరిచారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మొరాయించిన ఈవీఎంలు

- కొన్ని ప్రాంతాల్లో ఆలస్యంగా ప్రారంభమైన పోలింగ్
- రాత్రి 10 గంటల వరకు కొనసాగిన ఓటింగ్



తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గంలో మొత్తం 286 పోలింగ్ బూత్‌లు ఉండగా సోమవారం రాత్రి 10 గంటల వరకు కూడా కొన్ని బూత్‌లలో పోలింగ్ జరుగుతూనే ఉంది. ఉదయం 7 గంటలకు ఓటింగ్ ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉండగా నియోజకవర్గ వ్యాప్తంగా 43 బూత్‌లలో పది నుంచి 45 నిమిషాలు ఆలస్యంగా ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమయ్యింది. ఒక్కొక్క ఓటరు ఓటు వేసేందుకు రెండు నిమిషాలు పట్టడంతో చెయ్యి నుంచి 1500 ఓట్లు ఉన్న బూత్‌లలో రాత్రి 10 గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది. సాయంత్రం 6 గంటల లోపు పోలింగ్ బూత్‌కు వచ్చిన వారికి ముందుగానే అక్కడ వున్న సిబ్బంది స్లిప్‌లు ఇచ్చి పంపించివేశారు. పోలింగ్ బూత్ వద్ద లోపల క్యూలో వున్న వారిని లోపల ఉంచి పోలీసులు గేటు మూసివేశారు. నులకపేట, డోలాస్‌నగర్, దుగ్గిరాల, మంచికలపూడి, తదితర ప్రాంతాల్లో రాత్రి 10 గంటలైనా పోలింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. మరో 42 బూత్‌లలో రాత్రి 8.30 వరకు ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాత్రి 9 గంటల వరకు 74.84 శాతం నమోదు కాగా, మరో 6 శాతం ఓటింగ్ పెరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

సీబీఎస్ఈ టెన్త్ ఫలితాల్లో బాలకుటీర్ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: సోమవారం ప్రకటించిన సీబీఎస్ఈ టెన్త్ ఫలితాల్లో శ్యామలానగర్‌లోని శ్రీవేంకటేశ్వర బాలకుటీర్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల వ్యవస్థాపకురాలు డాక్టర్ ఎస్.మంగాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు హాజరైన 197 మంది విద్యార్థులందరు ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. 485 మార్కులతో రేయాన్ ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. సబ్జెక్టుల వారీగా ఇంగ్లిష్–97, ద్వితీయ భాష–100, మ్యాథ్స్–100, సైన్స్–97, సోషల్–99 మార్కులను విద్యార్థులు సాధించారని వివరించారు.

ఆద్యంతం ఓటరు జోరు

పొద్దున్నే లేచి ఓటేసి వస్తే ఓ పనైపోతుందనుకున్నారు కొందరు. నిదానంగా టిఫిన్ చేసి వెళ్తే గంటలోగా ఇంటికొచ్చేయొచ్చనుకున్నారు ఇంకొందరు. అబ్బే మధ్యాహ్నం వెళితే ఎవరూ ఉండరు. నిమిషాల్లో ఓటేసి పోవచ్చనుకున్నారు మరికొందరు. ఇదంతా కాదు సాయంత్రం వెళితే చల్లగా ఉంటుంది. పది ఇరవై నిమిషాలు ఆలస్యమైనా ఫర్వాలేదనుకున్నారు ఎందరో...కానీ వీరి అంచనాలన్నీ తలకిందులయ్యాయి. సమయంతో పనిలేకుండా పోలింగ్ కేంద్రానికి ఎప్పుడెళ్లినా బారులు తీరిన ఓటర్లే కనిపించారు. పోలింగ్ బూతునుంచి ఓటేసి రావాలంటే కనీసం గంటన్నరపాటు వేచిచూడాల్సి వచ్చింది. కారణం అందరిలోనూ వెల్లివిరిసిన చైతన్యం. ఎక్కడి నుంచి వచ్చిందో తెలీదు అటు యువత నుంచి ఇటు మహిళలు, చివరకు పండుటాకులు సైతం మహా క్రతువుగా భావించారు. క్యూలైన్లలో బారులు తీరారు. ఓవైపు ఉక్కపోత..మరో వైపు ఎండ తీవ్రత వేధించినా ఓర్పుతో ఓటు వేసేదాకా ఓపిక పట్టారు. సోమవారం ఇక్కడా అక్కడా కాదు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల సందోహం ఓ జాతరను తలపించింది.


ఓటు వేసేందుకు వస్తున్న బామ్మ


వీల్‌చైర్‌లో వస్తున్న వృద్ధురాలు


నగర పరిధిలో ఉదయం ఏడు గంటలకే బారులు తీరిన ఓటర్లు

- తిరునాళ్ల వాతావరణాన్ని తలపించిన పోలింగ్ కేంద్రాలు
- మండుటెండను సైతం లెక్కచేయని వైనం

మంగళగిరి: నియోజకవర్గంలో ప్రశాంతంగా పోలింగ్ కొనసాగింది. అక్కడక్కడా చిన్నపాటి సంఘటనలు, ఈవీఎంల మొరాయింపుతో కొద్దిసేపు పోలింగ్ ఆగినా సాయంత్రానికి ప్రశాంతంగా కొనసాగింది. సోమవారం పోలింగ్ దృష్ట్యా కేంద్రాల వద్ద అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. తాగునీరు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కానుండగా 6 గంటలకే ప్రజలు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. దుగ్గిరాల, మంగళగిరి మండలం శిబిరంలో చిన్నపాటి ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా సాగింది. నిదానంగా ప్రారంభమై..

ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ 9 గంటలకు తొలి రెండు గంటలలో 9.4 శాతం నమోదు కాగా 11 గంటలకు 18.82శాతం నమోదైంది. 11 గంటలకు ఏకంగా 46.06 శాతానికి చేరుకుంది. సాయంత్రం 3 గంటలకు 59.60 శాతానికి 5 గంటలకు 68.20 శాతానికి చేరుకుంది.

రాత్రి పదివరకు పోలింగ్

నియోజకవర్గంలో 2,92,432 మంది ఓటర్లుండగా రాత్రి 7 గంటల వరకు 2,22,836 మంది ఓటేశారు. రాత్రి 7 గంటలకు 74 శాతానికి చేరుకోగా మరిన్ని పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు బారులు తీరి వుండడంతో రాత్రి 10 గంటల వరకు పోలింగ్ కొనసాగే అవకాశముందని 80 శాతానికిపైగా పోలింగ్ నమోదు కావచ్చని అధికారులు తెలిపారు. మహిళలు అత్యధికంగా ఓటు హక్కును వినియోగించుకోవడం విశేషం. పురుషులు 1,00,800 మంది, మహిళలు 1,11,236 మంది ఓటేశారు. పురుషుల కంటే మహిళలు అత్యధికంగా 10,436 మంది అదనంగా ఓటింగ్‌లో పాల్గొనడం గమనార్హం.


నూతక్కి పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరం

ఓటెత్తారు


నూతక్కి పెదవడ్లపూడి గ్రామాలలో బారులు తీరిన ఓటర్లు

- ఓటర్లలో వెల్లివిరిసిన చైతన్యం
- యువకుల నుంచి వృద్ధుల వరకు పోలింగ్ కేంద్రాలకు తరలిన వైనం
- పోలింగ్ తీరును పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ
- లావణ్య విజయం తథ్యం అంటున్న ప్రజలు

మంగళగిరి: సాధారణ ఎన్నికలలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించేందుకు ఓటర్లు పోటెత్తారు. సంక్షేమ పథకాలు అందాలంటే జగన్ మోహన్‌రెడ్డిని గెలిపించాలన్న తపన అందరిలోనూ కనిపించింది. ముఖ్యంగా మహిళలు ఉదయం 7 గంటలకే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఒకటి రెండు చోట్ల ఈవీఎంలు మొరాయించడం మినహా పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగింది. వృద్ధులు, దివ్యాంగులు ఉదయమే తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు కుటుంబసభ్యుల సహకారంతో పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహిళలు భారీగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకోవడంతో టీడీపీ నాయకులు జీర్ణించుకోలేని పరిస్థితి కనిపించింది. సంక్షేమ పథకాలు కొనసాగాలనే కాంక్షతో మహిళలు ఇంత భారీ ఎత్తున తరలివచ్చారని తమ ఓటమి తథ్యమని టిడిపి నాయకులు కార్యకర్తలే వ్యాఖ్యానిస్తుండడం విశేషం. వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు పట్టణంలో సికే పాఠశాలలో ఓటు హక్కును వినియోగించుకుని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. సాయంత్రం ఆరు గంటల వరకు 68.20 శాతం పోలింగ్ కాగా క్యూలైన్లలో వేచి వున్న ఓటర్లతో ఓటింగ్ ముగిసే సమయానికి సుమారు 80 శాతానికి పైగా చేరుకోవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. పోలింగ్ రాత్రి 8 గంటల వరకు కొనసాగింది.


పోలింగ్ కేంద్రం వద్ద ఎస్పీ తుషార్ డూడీ


వీల్‌చైర్‌లో పోలింగ్ కేంద్రానికి వస్తున్న వృద్ధురాలు

సాంకేతిక లోపం..సర్వత్రా జాప్యం

- మొరాయించిన ఈవీఎంలు
- ఓటేసేందుకు వరుస కట్టిన మహిళ ఓటర్లు
- ప్రశాంతంగా పోలింగ్

ఫిరంగిపురం: ఈవీఎంలలో తలెత్తిన సాంకేతిక లోపం కారణంగా పలుచోట్ల పోలింగ్ కాస్త ఆలస్యంగా ప్రారంభమైంది. ఇది మినహా మండల వ్యాప్తంగా మొత్తం 18 గ్రామాల్లో ఓటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సాగింది. ఉదయం 6 గంటలకే ఓటర్లు అధిక సంఖ్యలో పోలింగ్ బూత్‌ల వద్దకు చేరుకున్నారు. ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు షామియానాలు, తాగునీటి సౌకర్యం, కుర్చీలు, పరిసరప్రాంతాలు శుభ్రంగా ఉండేలా ఏర్పాట్లు చేశారు.

ఓటు వేసిన మేకతోటి సుచరిత: ఫిరంగిపురంలోని సెయింట్‌ఆన్స్ పాఠశాలలో తాడికొండ నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. అనంతరం ఓటింగ్ సరళిపై సంబంధిత నాయకులను అడిగి తెలుసుకున్నారు. జెడ్పీటీసీ సభ్యులు డి. కర్ణరేణమ్మ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

అధికులనుంచి అనూహ్య స్పందన: పలు గ్రామాల్లో ఉదయం ,సాయంత్రం వేళల్లో మహిళా ఓటర్లు అధిక సంఖ్యలో క్యూలైన్‌లో బారులు తీరారు. గంటల తరబడి నిలబడిని ఓపికతో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓవైపు ఎండతీవ్రత, ఉక్కపోత ను సైతం లెక్క చేయకుండా ఓటు వేసేందుకు ఆసక్తి కనబరిచారు.

సమయం దాటినా ఓటింగ్: కొన్ని గ్రామాల్లో ఓటర్లు బారులు తీరడంతో పోలింగ్ పరిమితి సమయం దాటినా కొనసాగిస్తున్నారు. నుదురుపాడు, తక్కెళ్లపాడు గ్రామాల్లో పోలింగ్ ప్రక్రియ సాయంత్రం ఏడుదాకా నిర్వహించారు. మండలంలో మొత్తం 77శాతం వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

పోలింగ్ బూత్ ఆవరణలో వైద్యశిబిరాలు: మండలంలోని 65బూత్‌ల వద్ద నుదురుపాడు, ఫిరంగిపురం పీహెచ్‌సీల ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు నిర్వహించారు. పరీక్షలు చేసి మందులు అందజేశారు. వడదెబ్బ తగలకుండా ఉండేందుకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు.


ఓటు హక్కును వినియోగించుకున్న నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత


శిబిరంలో వైద్యారోగ్య సిబ్బంది

ఉత్కంఠగా సాగిన సార్వత్రిక పోలింగ్ ప్రక్రియ


మేడికొండూరులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి చేస్తున్న టీడీపీ శ్రేణులు


టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

మేడికొండూరు: సార్వత్రిక ఎన్నికలు మండలంలో ఉత్కంఠ పరిస్థితుల్లో సోమవారం ముగిశాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా మండలంలోని 14 గ్రామాల్లో జరిగిన ఎన్నికల్లో ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చింది.

టీడీపీ వర్గీయుల దాడులు

మండల కేంద్రమైన మేడికొండూరులో 46, 47, 48 పోలింగ్ బూత్ వద్ద టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఓటర్లను సైకిల్ గుర్తుకు వేయాలంటూ ప్రచారం చేశారు. గమనించిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రశ్నించడంతో దాడులకు పాల్పడ్డారు. వైఎస్సార్‌సీపీకి చెందిన కార్యకర్తలపై కర్రలతో టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు. కొర్రపాడు జిల్లాపరిషత్ హైస్కూల్‌లో 168 పోలింగ్ స్టేషన్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు వృద్ధులను ఓటు వేసేందుకు తీసుకొస్తున్న సమయంలో టీడీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దాడిలో వైఎస్సార్‌సీపీ చెందిన ప్రసన్న, చెన్నయ్య, అనిల్, విజయ్ గాయపడ్డారు. క్షతగాత్రులను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. జంగంగుంట్లపాలెం , పొట్లపాడు 168 పోలింగ్‌బూత్‌లో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని టీడీపీ నాయకులు వాదనకు దిగారు. ఈ నేపథ్యంలో అధికారులు కొంత సమయం పోలింగ్ నిలిపివేశారు. నిబంధనలు అతిక్రమించి అల్లర్లకు పాల్పడిన వారిపై కేసు నమోదు చేయనున్నట్లు ఎన్నికల అధికారి వెల్లడించారు.

దాడులు...దౌర్జన్యాలు

- పోలింగ్ బూత్‌లో రెచ్చిపోయిన టీడీపీ కార్యకర్తలు
- బూత్‌లలోనూ ప్రచారానికి దిగిన వైనం
- అడ్డుకునే వారిపై దాడికి యత్నం
- పోలీసులపై దుర్భాషలాడిన టీడీపీ నాయకులు
- నులకపేటలో రాళ్ల దాడికి పాల్పడిన టీడీపీ మూకలు


ఇప్పటం పోలింగ్ బూత్‌లో ప్రచారం నిర్వహిస్తున్న జనసేన కార్యకర్త (తెల్ల చొక్కా)

తాడేపల్లిరూరల్: ఎలాగైనా గెలవాలనే తాపత్రయంతో టీడీపీ., జనసేన కార్యకర్తలు ఉదయం నుంచి బూత్‌లలో ఉంటూ ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాలు ముమ్మరంగా కొనసాగించారు. బూత్‌లో వున్న జనసేన, టీడీపీ కార్యకర్తలను బయటకు పంపించాలని డిమాండ్ చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడి చేసేందుకు ఒడిగట్టారు. ఉండవల్లిలో పలుమార్లు ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోవడంతో పోలీసులు తమ లాఠీలకు పనిచెప్పారు. వడ్డేశ్వరంలో పోలింగ్‌స్టేషన్ ఆవరణలో సాంబయ్య అనే వ్యక్తిపై దాడికి దిగారు. ఇప్పటంలో తెలుగుదేశం, జనసేన కార్యకర్తలు పోలింగ్ బూత్ లోపల ప్రచారం నిర్వహించడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అడ్డుకున్నారు. బయటకు వచ్చిన వారంతా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను అంతుచూస్తామంటూ హెచ్చరించారు. మద్యం మత్తులో దుర్భాషలాడారు. అక్కడే వున్న సాక్షి ప్రతినిధి ఫొటోలు తీయడానికి ప్రయత్నిస్తే అతనిపై దాడి చేసేందుకు ప్రయత్నించి మీ పురుకాడు చెప్పిరావాలంటూ నానా యాగీ చేశారు. కలెక్టర్,రిటర్నింగ్ అధికారులు ఐప్పన గుర్తింపు కార్డును చూపించినా ఖాతరు చేయలేదు. పోలీసులు జోక్యంతో జనసేన, టీడీపీ కార్యకర్తలు అక్కడి నుంచి పరారయ్యారు. ఒకే వ్యక్తి ఉదయం 7 గంటల నుంచి 11గంటల వరకు బూత్‌లో ఉన్నాడని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అక్కడి నుంచి అతణ్ని బయటకు పంపించేందుకు సిబ్బంది ప్రయత్నించగా ఆడవారికి దాడి చేసేందుకు ప్రయత్నించారు. పోలీసులు తమదైన శైలిలో సమాధానం చెప్పారు. కుడి,ఎడమ చేతికి సిరా వేయించి బయటకు పంపించారు. ఈ చర్యను జీర్ణించుకోలేని సదరు వ్యక్తి బయటకు వచ్చి తీవ్ర ఆగ్రహంతో రెచ్చిపోయాడు. స్పందించిన పోలీసులు లాఠీలకు పనిచెప్పడంతో అక్కడి నుంచి జారుకున్నారు. చిర్రావూరు, వడ్డేశ్వరంలో సుమారు 30 మంది మహిళలను బూత్ వద్ద నిలబెట్టి ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డిని నిందించడంతో పాటు సైకిల్‌కు ఓటు వేయాలని చెప్పడంతో స్వల్ప వివాదం తలెత్తింది.

దుగ్గిరాల మండలంలో..

దుగ్గిరాల మండల పరిధిలోని పెదకొండూరు, మంచికలపూడి, దుగ్గిరాల, రేవేంద్రపాడు, తుమ్మపూడి ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. బూత్‌లలో టీడీపీ కార్యకర్తలు చేస్తున్న ప్రచారాన్ని అడ్డుకున్నవారిపై దాడులకు పాల్పడ్డారు. పెదకొండూరులో బూత్‌లోపల ప్రచారం చేస్తున్న వ్యక్తులను బయటకు పంపించాలని వైఎస్సార్‌సీపీ బూత్ ఏజెంట్ కోరడంతో పక్కనే ఉన్న టీడీపీ కార్యకర్త దాడికి దిగాడు. పోలీసులు చూడకుండా తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేటలో టీడీపీ ప్రచారం నిర్వహించడంతో పోలీసులు టీడీపీ కార్యకర్తలను బయటకు పంపించే ప్రయత్నం చేయగా పోలీసులపై దాడికి ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని బయటకు పంపించడంతో గోడపై నిలబడి వైఎస్సార్‌సీపీకి ఓటు వేస్తున్నారని పక్కనే ఉన్న ఇటుకరాళ్లను విసిరివేశారు. సీతానగరం, మహానాడు, డోలాస్‌నగర్, క్రిస్టియన్‌పేట, ప్రకాష్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఇలాంటి సంఘటనలే చోటు చేసుకున్నాయి. పోలింగ్ బూత్‌ల వద్ద తగిన సిబ్బంది లేనందునే టీడీపీ కార్యకర్తలు నాయకులు ఇలా రెచ్చిపోయారంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

వెల్లివిరిసిన చైతన్యం

- రాత్రయినా క్యూ కట్టిన ఓటర్లు
- పెదపరిమి, నిడుముక్కల గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులపై టీడీపీ నాయకుల దాడి
- దొండపాడులో టీడీపీ నాయకులు ఇళ్లలో బసచేసిన ఉద్యోగులను మరో చోటకు పంపించిన ఎన్నికల అధికారులు
- తాడికొండ పోలింగ్ ముఖ చిత్రం

తాడికొండ: తాడికొండ నియోజకవర్గంలో ఓటరు చైతన్యం వెల్లివిరిసింది. ఉదయం 7 గంటలు మొదలు సాయంత్రం 06 గంటలకు ఓటర్లు బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో పోలింగ్ కేంద్రాలు కిటకిటలాడాయి. పోలింగ్ ముగిసే సమయానికి క్యూలో ఉన్న వారిని ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం అధికారులు కల్పించారు. పోలింగ్ 7 గంటలకు ప్రారంభం కాగా ఉదయం 9 గంటలకు 4.83 శాతం ఓటింగ్ నమోదైంది. మధ్యాహ్నం ఒంటి గంటకు 41.49, 3 గంటలకు 47.72, 5 గంటలకు 73.05, 5 గంటలకు 73.05, 7 గంటలకు 74.82 చేరింది. పోలింగ్ ముగిసే సమయానికి 74.82 శాతం నమోదైంది. అయినప్పటికీ ఓటర్లు బారులు తీరి ఉండటంతో 6 గంటలకు క్యూ లైన్‌లో నిలబడిన వారికి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో ఓటింగ్ శాతం మరింత పెరగవచ్చని అధికారులు అంచనా.

దాడులు..పలోభాలు

తుళ్ళూరు మండలంలోని దొండపాడు గ్రామంలో 34,35 బూత్‌లలో విధులు నిర్వహించేందుకు వచ్చిన ఎన్నికల అధికారులు టీడీపీ నాయకుల ఇళ్లలో బసచేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో వారిని ఆ బూత్ నుంచి వేరే గ్రామంలోని బూత్‌కు తరలించారు. తాడికొండ మండలం బేజాత్పురంలోని 263 నంబరు పోలింగ్ బూత్‌లో ఉదయం ఈవీఎం మొరాయించడంతో పోలింగ్ అరగంట ఆలస్యంగా ప్రారంభమైంది. తుళ్ళూరు మండలం పెదపరిమిగ్రామంలో 48, 49 పోలింగ్ బూత్‌ల వద్ద టీడీపీ నాయకులు నిబంధనలు ఉల్లంఘించారు. ఓటర్లను ప్రభావితం చేసేందుకు యత్నిస్తున్న టీడీపీ నాయకులు నూతలపాటి రామారావు, ధనేకుల రామారావు తదితరుల తీరును వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు శృంగారపాటి సందీప్ ప్రశ్నించగా దాడికి దిగారు.అంతటితో ఆగకుండా సందీప్ కారు అద్దాలు పగలగొట్టారు. పోలీసులు తక్షణమే స్పందించి ఉంటే ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదని, శృంగారపాటి సందీప్ ఆవేదన వ్యక్తం చేశారు. నిడుముక్కల గ్రామంలో మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బండ్ల సాంబశివరావుపై టీడీపీ నాయకుడు నెప్పల్లి కిషోర్ దాడి చేయడంతో గాయపడ్డారు. వైఎస్సార్‌సీపీలోని ఎస్సీ నాయకులపై నిడుముక్కల టీడీపీ నాయకులు కులం పేరుతో దూషించారు. ఆగ్రహించిన ఎస్సీలు నిలదీసేందుకు వెళ్లగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి ఇరువర్గాలను మోహరించారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొందని సీఐ ప్రభాకర్ తెలిపారు.


తాడికొండ పంచాయతీ కార్యాలయం వద్ద బారులు తీరిన మహిళలు



టీడీపీ దాడిలో గాయపడిన నిడుముక్కల వైఎస్సార్‌సీపీ నాయకుడు సాంబశివరావు, పెదపరిమిలో గాయపడిన యువకుడు


ముక్కామలలో ఓటు వేసిన ఎంపీపీ తాళ్ళ భాగ్యలక్ష్మి, కుమార్తెలు


కంతేరులో ఓటు వేసిన మేకతోటి దయాసాగర్, కుమారుడు, కుమార్తె

ఓటు వేసిన దయాసాగర్

తాడికొండ మండలం కంతేరు బూత్‌లో మరిలీపేట పోర్టు ట్రస్టు మేనేజింగ్ డైరెక్టర్ మేకతోటి దయాసాగర్, కుమారుడు మేకతోటి హర్షిత్, కుమార్తె మేకతోటి రిషికలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తాడికొండ ఎంపీపీ తాళ్ళ భాగ్యలక్ష్మి స్వగ్రామమైన ముక్కామలలో తమ కుమార్తెలతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ప్రశాంతంగా పోలింగ్

తెనాలి రూరల్: రూరల్ మండల గ్రామాల్లో గురువారం ప్రశాంతంగా పోలింగ్ జరిగింది. 18 గ్రామాల్లో 64,666 ఓట్లు ఉండగా సాయంత్రం 6గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి సుమారు 63 శాతానికి పైగా ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ కేంద్రాల వద్ద వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. మంది సీటి సౌకర్యం కల్పించారు.